యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు


ఏనుగుల చెరువులో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం


మామిళ్లవారిపల్లె చెరువులో జేసీబీ, ట్రాక్టర్లతో అక్రమంగా తవ్వకాలు

- జేసీబీలతో ఇష్టానుసారంగా తోడేస్తున్న దళారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

గుర్రంకొండ : కొంతమంది దళారులు చెరువుల్లో యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. జేసీబీలతో చెరువుల్లో ఇష్టానుసారంగా ఇసుక, మట్టిని తవ్వేసి ట్రాక్టర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. పట్టించుకొని చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చొద్యం చూస్తూ కాలం గడుపుతున్నారు. మండలంలోని తరిగొండ పంచాయతీలో రామానాయిని చెరువులో పెద్ద ఇరిగేషన్ చెరువు. ఈచెరువులో గత వారం రోజులుగా కొంతమంది దళారులు అక్రమంగా జేసీబీలతో చెరువులోని ఇసుకను తోడేస్తున్నారు. రోజంతా ట్రాక్టర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలించుకు పోతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే గ్రామస్తులపై దూషణలకు, దాడులకు పాల్పడుతున్నారు. జేసీబీలు, పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో చెరువుల్లో చేరుకొని ఇష్టానుసారంగా ఇసుకను తరలించుకు పోతున్నారు. బయట మండలాలు, ఇతర ప్రాంతాలకు చెందిన దళారులు ఈ చర్యలకు పాల్పడుతున్నారు. గుర్రంకొండకు సమీపంలోని ఎనుగుల చెరువు, సంగసముద్రం పంచాయతీలో యల్లంపల్లె, మామిళ్లవారిపల్లె చెరువుల్లో జేసీబీలతో ఇసుకతో పాటు, మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రిళ్లు లైట్లు వేసుకొని మరీ జేసీబీలతో ఇసుక తవ్వకాలు జోరుగా జరుపుతుండడం గమనార్హం. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈవిషయమై వీఆర్వో రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా చెరువుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరపుతున్న విషయం వాస్తవమే అన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమ సిబ్బందిపై కూడా దాడులు చేస్తున్నారన్నారు. జరుగుతున్న సంఘటన లపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు చేపడతామన్నారు.


తరిగొండ రామానాయిని చెరువుల్లో ట్రాక్టర్లతో ఇసుక తరలింపు

రెఫరల్ కేసులు తగ్గించాలి

సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యులు రెఫరల్ కేసులు తగ్గించాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు అన్నారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులతో వైద్యసేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మదనపల్లె మెడికల్ కాలేజీకి సంబంధించి, అనుబంధ ఆస్పత్రిగా ఎంపికైన జిల్లా ఆస్పత్రికి త్వరలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం పరిశీలనకు రానున్నదన్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలోని అన్ని విభాగాల వైద్యులు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అన్ని రకాల వైద్యపరీక్షలను రోగులకు అవసరం మేరకు నిర్వహించాలన్నారు. ఆస్పత్రి పనివేళల్లో వైద్యులు అందుబాటులో ఉంటూ, విధులకు సంబంధించి సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. ఆస్పత్రి వైద్యులతో పాటు మిగిలిన సిబ్బంది విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, మెడికల్ డిప్యూటీ సూపరిండెంట్ బాబు, ఆర్ఎంఓ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.


వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు

విద్యతో పాటు కంప్యూటర్ శిక్షణ

వాల్మీకిపురం : పోటీ ప్రపంచంలో విద్యతో పాటు కంప్యూటర్ శిక్షణ కూడా అత్యంత అవసరమని అరుణోదయ పబ్లిక్ వెల్ఫేర్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జాకబ్ అన్నారు. అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి కంప్యూటర్ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ఏఎస్సై శంకర్, విశ్రాంత పిడి వెంకట్రామ వర్మ, ఆర్ఎంపి వైద్యురాలు శకుంతల హాజరై సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ ప్రభుకిరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందిస్తున్న జాకబ్

ప్రతీకార దాడుల సంస్కృతికి స్వస్తి పలకండి



మాట్లాడుతున్న రాయచోటి డీఎస్పీ శ్రీనివాసరావ్, హాజరైన వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు

- ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు
- రాయచోటి డీఎస్పీ శ్రీనివాసరావ్

గుర్రంకొండ : గ్రామాల్లో ప్రతీకార దాడులకు అందరూ స్వస్తి పలకాలని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని రాయచోటి డీఎస్పీ శ్రీనివాసరావ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిశాయి. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కలిగించేందకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. అనవసరమైన పరస్పర ప్రతికార దాడులకు దిగితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించేవారు ఎవరైనా వదిలిపెట్టమన్నారు. అనవసరంగా దూషణలకు దిగడం, ఎదుటివారి వ్యక్తిత్వాలను కించపరుస్తూ వ్యవహరించడం మానుకోవాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారన్నారు. సోషియల్ మీడియాలో అనవసరమైన, అభ్యంతరకరమైన పోస్టులు పెట్టి ఘర్షణలకు కారణమైన వారిని వదిలిపెట్టమన్నారు. నాయకులు పై సూచనలు గుర్తుంచుకొని పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశాల్లో వాల్మీకీపురం సీఐ పులిశేఖర్, ఎస్ఐ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ ఆశావర్కర్ల బాధ్యత

కలకడ : గ్రామాల్లో ప్రజా ఆరోగ్య పరిరక్షణను ఆశావర్కర్ల బాధ్యతగా తీసుకోవాలని డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అజెండా ప్రకారం అతిసార నియంత్రణ, టిఫా, యూఎఫ్‌జి స్కాన్ ప్రాముఖ్యతను, గర్భనిర్ధారణ కిట్లు, ఆశా యాప్ వినియోగం, నమోదు వంటివాటి గురించి తెలియజేశారు. వర్షాకాలంలో మలేరియా, విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున నివారణ మార్గాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్న, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల కరపత్రాలు ఆవిష్కరణ

- జులై 24, 25, 26 తేదీల్లో మున్సిపల్ వర్కర్స్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు
- హార్సిలీహిల్స్‌లో నిర్వహణ

మదనపల్లె : మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జులై 24, 25, 26 తేదీల్లో హార్సిలీహిల్స్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్రప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం ఎస్టీయూ భవన్‌లో శిక్షణ తరగతులకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఎంపికచేసిన 500 మంది మున్సిపల్ వర్కర్స్ ప్రతినిధులు ఈ వైజ్ఞానిక శిక్షణ తరగతులకు హాజరవుతారన్నారు. శిక్షణ తరగతులు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించి, భవిష్యత్ ఉద్యమాలకు వేదికగా నిలుస్తాయన్నారు. కార్మికవర్గంలో నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణాతరగతుల్లో బోధన చేస్తారన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వజ్రిసురేష్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు ముబారక్, మస్తాన్, మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజు, పృథ్వీరాజ్, వాసు, లోకేష్, నాగరాజు, ఓబులేష్, శంకరప్రసాద్, ఉమారాణి, భాగ్యమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ వర్కర్స్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ కె. బాలాజి

కేవీపల్లె : ఈ నెల 13 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి పాఠశాల పరిశుభ్రంగా ఉండాలని తిరుపతి డీవైఈఓ కె. బాలాజి అన్నారు. మంగళవారం మండలంలోని గర్నిమిట్టలో పార్థ ప్రయివేట్ పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం కేవీపల్లెలో ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించి సీఆర్పీలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే సిద్ధంగా ఉండాలన్నారు. మిషన్‌లైఫ్ కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి, క్లష్టర్ హెడ్‌మాస్టర్ వై. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో....వేడుకల్లో పాల్గొనేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నాలుగు బస్సులను ఏర్పాటు చేశారు. పాసు లున్న వారు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వీటిలో రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె మండలాలకు ఒకొక్కటి చొప్పున, అర్బన్‌కు ఒకటిచొప్పున కేటాయించారు. ఇవి కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రమాణ స్వీకార వేడుకలకు హాజరయ్యేందుకు ప్రత్యేకంగా ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేసుకుని బయలుదేరి వెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయాల ప్రాంగణాల్లో చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


నిమ్మనపల్లె నుంచి సీఎం ప్రమాణ స్వీకారానికి బయలు దేరుతున్న ప్రజలు, టీడీపీ నాయకులు

విద్యుత్ వెలుగుల్లో సబ్ కలెక్టరేట్


విద్యుత్ వెలుగుల్లో మదనపల్లె సబ్ కలెక్టరేట్

మదనపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌ను విద్యుత్ వెలుగుల్లో నింపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో ఏర్పాట్లు చేసినట్లు సబ్ కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందాం

రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. తాను అధికారంలో ఉన్నన్ని రోజులు అటు రైతుల పక్షాన నిలబడటంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనవైపు నిలబడి విజయ తీరాల వైపు నడిపించేందుకు కృషి చేశారని, కానీ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందామన్నారు. ఈ ఎన్నికల్లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని ముందుకు వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని అన్నారు. కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలని, ఇక నుంచి ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమకాటుతో వ్యాధుల వ్యాప్తి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం : దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి జులేఖ బేగం అన్నారు. మంగళవారం చింతపర్తి పిహెచ్‌సి పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంటు కలిగిన దోమలను నియంత్రణ చేస్తే జ్వరాలు రావన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మరుగునీరు కాల్వల్లో నీరు పారే విధంగా చూసుకోవాలని, రోజు సాయంత్ర వేళల్లో వేపాకు పొగ వేసుకోవాలని, కిటికీలకు మెస్‌కు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, వైద్య సిబ్బంది ముజీబ్, సుధాకర్, భానుబి, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం


మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కేవీపల్లె : మలేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని డాక్టర్ రేష్మ అన్నారు. మంగళవారం గర్నిమిట్ట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా సోకిన వ్యక్తి సకాలంలో చికిత్స పొందాలన్నారు. చలితో కూడిన జ్వరం, చెమట పట్టడం, తల నొప్పి, ఒళ్లు నొప్పులు, కడుపు నొప్పి, వాంతులు, వికారం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అపరిశుభ్రమైన పరిసరాలు, నీటి నిల్వలలో దోమలు వృద్ధి చెంది మలేరియా వ్యాప్తికి దోహద పడుతాయన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అర్చన, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్ఎన్ రమాదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు రుక్మిణి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన


ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

పీలేరు : మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు ఎంజీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో టెక్‌మహీంద్ర, జీఎస్ఎస్ గ్లోబెల్, రోబోట్, ఈడీ, ఎయిర్‌టెల్, పాదర్‌లాండ్ లాంటి 50 కంపెనీలు హాజరు కాగా డిప్లమా, బిటెక్, చదివిన విద్యార్థులు 985 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూల్లో 398 మంది ఎంపికైనట్లు తెలిపారు. కళాశాలకు అనేక కంపెనీలు రావడం, గ్రామీణ విద్యార్థులను, ప్రతిభ ఉన్నవారిని ఎంపిక చేయడం కాళాశాలకు గుర్తింపు, విద్యార్థులకు ఉపాధి కల్పించడానికి ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల చైర్మన్ అవినాష్‌కుమార్‌రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

క్లుప్తంగా

వెబ్‌సైట్ ద్వారా రైతులకు మరింత సమాచారం

పీలేరు : విద్యార్థులు తయారు చేసిన వెబ్‌సైట్ ద్వారా రైతులకు త్వరిత గతిన మరింత సమాచారం అందుతుందని ప్రకృతి వ్యవసాయనిపుణుడు బోదేషవల్లి అన్నారు. మంగళవారం పీలేరులోని రైతు ఉత్పత్తిదారుల సంఘం కోసం స్థానిక సిఎస్ఆర్ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు రూపకల్పన చేసిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. 2018 నుంచి ఏపీ మాస్ ఆధ్వర్యంలో పీలేరు, కెవిపల్లె మండలాలకు చెందిన రైతు సంఘాల ద్వారా రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు గిట్టుబాటు ధర, విక్రయ కేంద్రాలను తెలియజేయడానికి రైతులు సభ్యులుగా కేంద్రం కొనసాగిస్తున్నారు. ఈ కేంద్రానికి సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జయసింహా, గణేష్, హేమంత్, హరిప్రసాద్, వెంకటేష్, వెంకటేశ్వర, ఆయాన్‌లు జట్టుగా ఏర్పడి పీలేరు ఎఫ్.పి.ఓడాట్ ఓఆర్జీపేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ తయారు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో క్రయ విక్రయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏపిమాస్‌డైరెక్టర్ వినాయకరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ భార్గవి, సీఈఓ ప్రత్యూష, డైరెక్టర్లు శ్రీనివాసులురెడ్డి, శ్రీదేవి, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : కండక్టర్లు ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక డిపోలో తంబళ్లపల్లె రూటులో సిబ్బందిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రూటులో సమయ పాలన పాటించి ప్రయాణికులకు మన్ననలు పొందాలన్నారు. గ్యారేజీలో కండీషన్ బస్సులు తీసుకోవాలన్నారు. తంబళ్లపల్లె రూటులో ఆదాయం బాగా వస్తుందని మరింత పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీ


సైదాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫోర్సు సిబ్బంది

మదనపల్లె సిటీ : మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ఆర్ కాలనీ, సైదాపేట, వడ్డిపల్లి ప్రాంతాల్లో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్మాగారాలు, షాపుల్లో పని చేసే విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని ఫోర్సు డైరెక్టర్ లలితమ్మ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు పిల్లల తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫోర్సు సిబ్బంది నరసింహులు, రాధారాణి, స్వర్ణ, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం


ఆశా వర్కర్లకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దతిప్పసముద్రం : మండలంలోని గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ అధికారి పురుషోత్తం నాయక్, డాక్టర్ యస్వాని ఆశా వర్కర్లకు సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లతో వైద్య సిబ్బంది సమీక్షించారు. ప్రతి ఆశా వర్కర్ వారి పరిధిలోని గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో టీకాలతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. అలాగే ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయ్యేలా చూడాలని సూచించారు.

బండి సంజయ్‌ను కలిసిన మదనపల్లె నాయకులు


బండిసంజయ్‌తో ఓసూరి కిరణ్‌కుమార్

మదనపల్లె : కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మంగళవారం బీజేపీ కిసాన్‌మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ ఓసూరి కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండిసంజయ్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో కర్ణాటక ఎన్నికల్లో ఆయనతో కలిసి పనిచేసిన రోజులను గుర్తుచేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నిర్వహించిన బాధ్యతలు, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఎంపీగా ఎంపికై, కేంద్రమంత్రి పదవిని చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హోదాలో రాజంపేట పార్లమెంటరీ పరిధిలో పర్యటించి, స్థానిక అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరారు.